నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 6 డిసెంబర్ 2024 | VIKARABAD


ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

# నిర్బంధంపై నిరసన

## ప్రజాప్రతినిధుల అరెస్టుపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

రంగారెడ్డి, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ శ్రేణులపై కొనసాగుతున్న నిర్బంధంపై జిల్లాలో పలుచోట్ల నిరసన వ్యక్తమవుతున్నది. బీఆర్ఎస్ చేపట్టిన గురుకులాల బాట కార్యక్రమాన్నీ అడ్డుకుంటుండడంతో పలు చోట్ల పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ చర్యలను ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలపై కేసుల పరంపర కొనసాగుతున్నది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురుకులాల బాటలో భాగంగా ఇబ్రహీంపట్నం సెగ్మెంట్ పరిధిలోని పలు గురుకులాలకెళ్లి విద్యార్థుల సమస్యలు, వారికి అందుతున్న భోజనం, సౌకర్యాలు తెలుసుకుని ప్రభుత్వంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇది మింగుడు పడని ప్రభుత్వం ఆయనపై అక్రమంగా కేసులు బనాయించింది. అలాగే, షాద్‌నగర్, మహేశ్వరం తదితర నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌తోపాటు విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన గురుకులాల బాటపైనా ప్రభుత్వం ఎక్కడికక్కడ నిర్బంధం విధించింది. ప్రిన్సిపాళ్ల అనుమతుల్లేకుండా ఎవరూ హాస్టళ్లలోకి వెళ్లొద్దని, ప్రిన్సిపాళ్ల ఎదుటే విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకోవాలని నిబంధన విధించింది. దీంతో విద్యార్థులు తమ సమస్యలను ధైర్యంగా చెప్పలేకపోతున్నారు.

### హరీశ్‌రావు అరెస్టుపై 'పట్నం'లో నిరసన

ఇబ్రహీంపట్నం రూరల్ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అరెస్టుపై బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జిల్లాలో పలు చోట్ల నిరసనలు వ్యక్తమయ్యాయి. బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు.. అలాగే, అంబేద్కర్ చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన కొనసాగుతున్నదని మండిపడ్డారు. హరీశ్‌రావు అరెస్టు అక్రమమన్నారు. చిల్లర రాజకీయాలతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయని, రానున్న రోజుల్లో తగిన బుద్ధి తప్పదని హెచ్చరించారు. నిరసనలో బీఆర్ఎస్వీ నాయకులు రాజ్‌తార్, వినయ్, ప్రసాద్; వేణు, హరీశ్, అరున్, వంశీ, అశోక్, రాకేశ్ తదితరులున్నారు.


వికారాబాద్ : వికారాబాద్‌లో నిరసన చేపట్టి మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య

గురుకులాలు అధ్వానంగా మారాయి. సమస్యలు ఎక్కడికక్కడ తిష్ట వేశాయి. విద్యార్థులకు సరైన ఆహారం అందడం లేదు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగ్గాలేదు. సౌకర్యాలు అంతంతే ఉన్నాయి.

### సమస్యలు బయటపడతాయనే భయంతోనే అరెస్టులు..

వాటిని ఎత్తిచూపేందుకు బీఆర్ఎస్ గురుకులాల బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గురుకులాల్లో పర్యటిస్తుంటే.. గురుకులాల్లోని సమస్యలు బయటపడతాయనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేసి రాష్ట్రవ్యాప్తంగా నిర్బంధ కాండ సృష్టిస్తున్నది. అధికారంలోకి వచ్చిన ఏడాదికాలంలోనే విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైనది.

-రాజ్‌కుమార్, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

## చేతగాని ప్రభుత్వం గద్దె దిగాలి

- బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల అరెస్టులు అక్రమం
- బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య

వికారాబాద్, డిసెంబర్ 5 : పాలన చేత గాని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్వీ నాయకులతో కలిసి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల అరెస్టుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు అక్రమమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న రేవంత్ సర్కారుకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలను నెరవేర్చే దమ్ములేక ప్రశ్నించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. అసమర్థ, చేతకాని, దదమ్మ ప్రభుత్వం అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేను వెంటనే విడుదల చేయాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, మైపాల్, శివ తదితరులు పాల్గొన్నారు.

# నిధులున్నా నిష్ఫలమే..

- కేసీఆర్ హయాంలో రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ. వందల కోట్ల నిధులు విడుదల
- ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే..
- పట్టించుకోని రేవంత్ సర్కార్.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

అసంపూర్తిగా నిలిచిన ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులు



**కేసీఆర్ హయాంలో జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, 21 మండలాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ. వందల కోట్ల నిధులను కేటాయించి టెండర్లు కూడా పిలిచారు. అయితే ప్రభుత్వం మారడంతో ఆ పనులకు మోక్షం లభించడం లేదు. నిధులున్నప్పటికీ ఒక్కపని కూడా ముందుకు సాగకపోవడంతో సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్నది. గత ప్రభుత్వంలో జిల్లాలోని మున్సిపాలిటీలు, మండలాల్లో వివిధ రకాల పనులను చేపట్టేందుకు ఎన్నికలకు ముందు గత సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు కేటాయించి ప్రొసీడింగ్‌లూ అందజేశారు. కొన్నిచోట్ల శంకుస్థాపనలూ జరిగాయి.** -రంగారెడ్డి, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ)

### ఒక్క పని కూడా సాగడం లేదు..

జిల్లాలో సుమారు రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు కేసీఆర్ హయాంలో అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు కేటాయించారు. అయితే ప్రభుత్వం మారడంతో ఆ పనులకు అవసరమైన నిధులున్నా ఒక్క పని కూడా సాఫీగా సాగడం లేదు. ఒక్క ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, మురుగుకాల్వలు, అసంపూర్తి భవనాలు తదితర వాటి కోసం సుమారు రూ. 424 కోట్ల నిధులు కేటాయించి టెండర్లు పిలిచినా పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదు. అంబేద్కర్ చౌరస్తా నుంచి నాగన్‌పల్లి వరకు సుమారు రూ. 60 కోట్లతో ఎస్ఆర్‌డీఈసీ పనులు, సాగర్ రహదారిలోని ఖానాపూర్ గేటు నుంచి నాగన్‌పల్లి రోడ్డు వరకు బైపాస్ రోడ్డు కోసం రూ.3 కోట్లు, ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు సుందరీకరణకు రూ.9 కోట్లు కేటాయింపు కూడా పూర్తైంది. అలాగే ఆమనగల్లు, షాద్‌నగర్, మహేశ్వరం, చేవెళ్ల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ హయాంలో నిధులు మంజూరై టెండర్లు పూర్తైనా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు.

### పెద్దచెరువు ఆధునీకరణ అంతేనా..?

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును ఆధునీకరించడంతోపాటు దానిని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు గత ప్రభుత్వం రూ.9 కోట్లను కేటాయించింది. కానీ, ప్రభుత్వం మారడంతో చెరువుకట్ట పనులకు బ్రేక్‌పడింది. జిల్లాలోని అన్ని చెరువులు ఆధునీకరణకు నోచుకున్నా ఇబ్రహీంపట్నం పెద్దచెరువుకు మాత్రం మోక్షం లభించడం లేదు.


ముందుకు సాగని లష్కర్‌గూడ – అనాజ్‌పూర్ వరకు ఉన్న వంతెన పనులు

### ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి లష్కర్‌గూడ వైపు వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు ఆధునీకరణకు కేసీఆర్ ప్రభుత్వం రూ.5 కోట్లను కేటాయించగా టెండర్ల ప్రక్రియ కూడా పూర్తైంది. అయితే కాంట్రాక్టర్ కొంత మేర పూర్తి చేశారు. మిగతా పనులకు సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో అక్కడికే ఆగిపోయాయి. నిధులున్నా పనులను చేపట్టకపోవడంతో లష్కర్‌గూడ, అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లష్కర్‌గూడ కల్వర్టు వద్ద వర్షం నీరు పొంగి ఆ వాగులో కారు కొట్టుకుపోయి ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ కల్వర్టు ప్రమాదకరంగా ఉన్నదని.. దానిని ఆధునీకరించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

### ఏడాది గడిచినా.. ఏమి లాభం లేదు..



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా నేటికీ ఏ ఒక్క చిన్న పనిని కూడా చేపట్టలేదు. గత ప్రభుత్వం నిధులు కేటాయించిన పనులను కూడా పూర్తి చేయకపోవడం సిగ్గుచేటు. ఇబ్రహీంపట్నంలో తహసీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, ప్రభుత్వ దవాఖాన.. ఇబ్రహీంపట్నం నుంచి నాగన్‌పల్లి మీదుగా అనాజ్‌పూర్ వరకు ఉన్న రోడ్డుతోపాటు సెగ్మెంట్‌లో పలు రకాల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రేవంత్ సర్కారు మాటలతోనే సరిపెడుతున్నది.

-ఏనుగు భరత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ

### బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి



కేసీఆర్ హయాంలో నిధులు మంజూరై అసంపూర్తిగా నిలిచిపోయిన లష్కర్‌గూడ –అబ్దుల్లాపూర్‌మెట్ రోడ్డులో వెంటనే బ్రిడ్జిని నిర్మించాలి. వానలు కురిసినప్పుడు ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా పనులు చేపట్టకపోవడం తగదు.

-సీక సాయికుమార్‌గౌడ్, లష్కర్‌గూడ

# ప్రైవేట్‌కు ధాన్యం


- సరిగ్గా పని చేయని ట్యాబ్‌లు.. తరుగు, తేమ శాతం విషయంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కొర్రీలు
- దళారులు, వ్యాపారులను ఆశ్రయిస్తూ నష్టపోతున్న రైతన్న
- ఇప్పటివరకు సేకరించిన ధాన్యం.. 19,675 మెట్రిక్ టన్నులే
- జిల్లాలో 1,30,000 ఎకరాల్లో వరి పంట సాగు

**వికారాబాద్ జిల్లాలో 126 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

## కొనుగోలు కేంద్రాల్లో అంతంత మాత్రంగానే విక్రయం

**జిల్లాలోని వరి ధాన్యం ప్రైవేట్ మార్కెట్‌కు తరలుతున్నది. అన్నదాతకు మద్దతు ధరను అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా.. అక్కడ జరుగుతున్న నష్టం, ట్యాబ్‌లు సరిగ్గా పనిచేయకపోవడం, వివిధ రకాల కొర్రీలతో రైతులు దళారులు, వ్యాపారుల వైపు చూస్తున్నారు. తమ పంటను తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమై నెల రోజులు దాటి నా ఇప్పటివరకు 19, 675 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు. ఈ వానకాలంలో అన్నదాతలు 1,30,000 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు.**

-వికారాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ)


కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేస్తూ..

జిల్లాలోని అన్నదాతలు దాదాపుగా తమ వరి ధాన్యాన్ని ప్రైవేట్ మార్కెట్‌లోనే విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తరుగు, తేమ శాతం పేరిట కొర్రీలు పెట్టడం, ట్యాబ్‌లు సరిగ్గా పని చేయకపోవడంతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నా రైతన్నలు తక్కువ ధర వచ్చినా సరే అనుకుని వ్యాపారులు, దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవకతవకలతోపాటు సమస్యలపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రు. దీంతో జిల్లాలోని మెజార్టీ రైతులంతా కొనుగోలు కేంద్రాల్లో కాకుం డా ప్రైవేట్ మార్కెట్‌కే ధాన్యాన్ని తరలిస్తున్నారు. మరోవైపు సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉన్నది. సన్న రకం ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల కంటే బయటనే ఎక్కువగా విక్రయిస్తున్నారు. కొనుగోలు ప్రక్రియ షురూ అయి నెల రోజులు కాగా ఇప్పటివరకు కేవలం 571 క్వింటాళ్ల సన్నాలను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల సేకరించింది.


ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తూ..

### 19,675 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమై నెల రోజులు దాటినా ఇప్పటివరకు 19,675 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించింది. జిల్లాలో వానకాలంలో 1.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు, మోసాలతో నిర్దేశించిన లక్ష్యంలో కనీసం 50 శాతం కూడా ధాన్యం రాకపోవడం గమనార్హం. గత వారం రోజులుగా దౌల్తాబాద్, బషీరాబా ద్, ధారూరు, బొంరాస్‌పేట మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్‌లు పనిచేయకపోవడంతో రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షించి..నిరీక్షించి చేసేదేమీ లేక ప్రైవేట్ మార్కెట్‌కు ధాన్యాన్ని తరలిస్తున్నారు. మరోవైపు ధాన్యం విక్రయించిన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు రెండు, మూడు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామంటూ ప్రభుత్వం ఒకవైపు చెబుతున్నా పది, పదిహేను రోజులు దాటుతున్నా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదు. ధాన్యా న్ని సేకరించిన అనంతరం వెంటనే బిల్లులు చేయాల్సిన కొనుగోలు కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. జిల్లాలో ఇప్పటివరకు రూ. 39.20 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించిన జిల్లా పౌరసరఫరాల శాఖ ఇప్పటివరకు కేవలం రూ.23 కోట్ల చెల్లింపులు మాత్రమే పూర్తి చేయగా.. మిగతా సుమారు రూ.16 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లోనే ఉన్నాయి. కాగా ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధరను చెల్లిస్తున్నది. అయితే జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

## 50 బస్సులు కావాలంటే.. 6 పంపారు

**శాసనసభాపతి ప్రసాద్‌కుమార్ అసంతృప్తి**

**వికారాబాద్ బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తానని వెల్లడి**

వికారాబాద్, డిసెంబర్ 5 : వికారాబాద్ ఆర్టీసీ డిపోకు మరో 50 బస్సులు కావాలని సంబంధిత శాఖ మంత్రిని కోరితే 6 బస్సులే పంపించారని రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం వికారాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల్లో భా గంగా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అధికారంలోకి వచ్చిన ఇరవై నాలుగు గంటల్లోనే అమలు చేశామని గుర్తు చేశారు. మహిళా ప్రయాణికులు పెరుగుతుండడంతో బస్సుల్లో రద్దీ కూడా పెరుగుతున్నదని.. అందువల్ల వికారాబాద్ డిపోకు మరో 50 నూతన బస్సులు కావాలని రవాణా శాఖ మం త్రిని కోరితే ఆరు బస్సులే పంపించారని పేర్కొన్నారు. సంస్థ లాభాల బాట లో పయనించేందుకు సిబ్బంది తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఎక్కువ లాభాలు వచ్చే రూట్లలో సమయానికి బస్సులు నడపాలన్నారు. బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఆర్టీసీ ప్రయాణాన్ని కల్పిస్తున్నదన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అరుణ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

# మంచు దుప్పటిలో..







వికారాబాద్ జిల్లాలోని పరిగి సెగ్మెంట్, పూడూరు మండలంలోని కంకల్ గ్రామంలో గురువారం ఉదయం పొగమంచు కమ్మేసింది. ఎక్కడ చూసినా మంచే ఉండడంతో రోడ్లు సైతం కనిపించ లేదు. మంచు దుప్పటిలో వాహనదారులు రాకపోకలు సాగించేం దుకు ఇబ్బంది పడ్డారు. గజగజ వణికిస్తున్న చలిలో రైతులు, కూలీలు, పాల విక్రేతలు తమ దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.